RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక



CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 280 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 16-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ||

VOLUME: 18 | ISSUE : 280 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 16-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

## సీఎం చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం



80వ స్వాతంత్ర్య దినోత్సవం

అమరావతిలో సీఎం చంద్రబాబు ప్రసంగం

గత పాలనలోని విధ్వంసం నుంచి

రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామన్న సీఎం

రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు,

వచ్చే ఏడాది పోలవరం పూర్తిపై హామీ

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. రాష్ట్రాన్ని వికాసం నుంచి వైభవం వైపు, సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ఐదున్నర కోట్ల మంది ఆంధ్రులు సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దశాబ్దాల పోరాటం, ఎందరో మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు కన్న కలలను సాకారం చేసి, 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడదాం. ఈ దేశానికి మనమేం ఇవ్వగలమని ఆలోచించడమే

తరువాయి 2లో..

# ఎర్రకోట నుంచి ప్రధాని వరాల జల్లు..

యువత, టెక్నాలజీ, క్రీడలే లక్ష్యంగా కీలక ప్రకటనలు

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని కీలక ప్రకటనలు

పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని హామీ

2036 ఒలింపిక్స్ ఆతిథ్యం లక్ష్యం, క్రీడా ప్రతిభ అన్వేషణకు కొత్త పథకం

దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ

సెమీకండక్టర్, అణు విద్యుత్ రంగాల్లో భారీ లక్ష్యాల నిర్దేశం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట వేదికగా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా యువత, విద్య, టెక్నాలజీ, క్రీడలు, పౌర రక్షణ, సెమీ కండక్టర్, అణుశక్తి వంటి కీలక రంగాల్లో పలు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రకటించారు. దేశ భవిష్యత్‌ను

తరువాయి 2లో..

# చిన్న తప్పు కూడా పెద్ద నష్టం కలిగిస్తుంది

ఇంటర్న్‌లకు నిర్మలా సీతారామన్ కీలక సందేశం

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ కింద పనిచేస్తున్న

ఇంటర్న్‌లతో నిర్మలా సీతారామన్ సమావేశం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ (పీఎంఐఎస్) కింద పని చేస్తున్న ఇంటర్న్‌లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ఢిల్లీలో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆమె యువతకు ముఖ్యమైన సందేశం

తరువాయి 2లో..

# మనం అడ్రస్ లేనివాళ్లం కాదు..

# మన కేరాఫ్ అడ్రస్ అమరావతి



విజయవాడలో 80వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని తమ విధానమని మరోసారి స్పష్టీకరణ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి

కులమతాలకు అతీతంగా స్వర్ణాంధ్ర సాధన కోసం పనిచేద్దామని పిలుపు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమష్టి కృషితో స్వర్ణాంధ్రను సాధించుకుం దామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల

తరువాయి 2లో..

# వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ తన పాత్ర పోషిస్తుంది

కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్

ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదుగుతోందని వ్యాఖ్య

వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడి

కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం

తరువాయి 2లో..



# 'స్త్రీ శక్తి'కి ఏడాది పూర్తి..

ఏపీలో రోజూ 24 లక్షల మంది మహిళల ఉచిత ప్రయాణం

ఏడాది పూర్తి చేసుకున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం

ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు వినియోగం

మహిళా ప్రయాణికులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు

ఏడాదిలో 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు, రూ.3,095 కోట్ల వ్యయం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్ ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ప్రభుత్వం వెల్లడించింది. పథకం తొలి వార్షికోత్సవం సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు ఇవాళ (ఆగస్టు 15) ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, లబ్ధిదారులైన మహిళలతో ముచ్చటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్ర బాబు ఒక ఆర్టీసీ బస్సు ఎక్కి, అందులో ప్రయా ణిస్తున్న మహిళలతో మాట్లాడారు. పథకం అమలు తీరుపై వారి నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసు కున్నారు. వారి కుటుంబాలు, జీవనోపాధి, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా వారికి కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్,

తరువాయి 2లో..

# భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

భారత్ ప్రగతిని ప్రశంసించిన పుతిన్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్‌కు శుభాకాంక్షలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్

తరువాయి 2లో..

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి

ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య

దెబ్బతిన్న వ్యవస్థలను32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన

తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య



తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# బాబుకు ఎమ్మెల్యేలకు గ్యాప్ ఉందా ?

చంద్రబాబు అంటే రాజకీయ అనుభవం విశేషంగా ఉన్న నాయకుడు. అంతే కాదు ప్రస్తుతం నాలుగవ సారి ఏపీకి సీఎం గా వ్యవహరిస్తున్నారు. టీడీపీ మీద పూర్తి పట్టు ఉంది. పార్టీని గత 31 ఏళ్ళుగా తన భుజ స్కందాలు మీద మోస్తున్నారు. పార్టీలో సగానికి పైగా క్యాడర్ ని ఆయన నేరుగా గుర్తు పట్టేంత పరిచయాలు ఉన్నాయి. ఇక తాను టికెట్లు ఇచ్చి గెలిపించుకున్న ఎమ్మెల్యేల విషయంలో బాబుకు ఉన్న ఫోకస్ కూడా చాలా గట్టిదే అని అంటారు. ఇక ఈసారి పార్టీతో పాటు ప్రభుత్వాన్ని బాలెన్స్ చేస్తూ బాబు రోజు మొత్తంలో అధిక సమయం వెచ్చిస్తున్నారు. ఎమ్మెల్యేలతో తరచూ టెలి కాన్ఫరెన్స్ లు పెడుతున్నారు. వీలు వెంబడి పిలిపించుకుని మాట్లాడుతున్నారు. దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా కూడా బాబుకు ఎమ్మెల్యేలకు మధ్య ఎక్కడో గ్యాప్ ఉందని అయితే ప్రచారం సాగుతోంది. బాబు ఆదేశాలు సూచనలు ఒక వైపు ఉంటే ఎమ్మెల్యేల తీరు మరో విధంగా ఉందని అంటున్నారు. ఇక తెలుగుదేశం పార్టీ గురించి మాట్లాడితే ముందు క్రమశిక్షణే గుర్తుకు వస్తుంది. అక్కడ ఎవరైనా ఎంతటి పెద్ద వారు అయినా తప్పు చేస్తే యాక్షన్ కచ్చితంగా ఉంటుంది. ఏకంగా సస్పెండ్ చేసే దాకా వ్యవహారం వెళ్తుంది. ఆఖరుకు పార్టీలో ఎంపీలు ఎమ్మెల్యేలు అయినా బాబు మాట వేదంగా ఉంటుంది. ఎవరైనా సరే పార్టీ ముందుకు రావాల్సిందే. బాబుకు అంతగా కంట్రోల్ పార్టీ మీద ఉంది. ఇక చూస్తే 2024 ఎన్నికల్లో టీడీపీ జనసేన బీజేపీలతో కలిసి కూటమిగా ఏర్పడి బంపర్ విక్టరీని కొట్టింది. అయితే ఇంత భారీ మెజారిటీ వచ్చిన తరువాత మాత్రం టీడీపీలో గతంలో మాదిరిగా పరిస్థితి లేదని అంటున్నారు. కొంచెం క్రమశిక్షణ కూడా తగ్గింది అని అంటున్నారు. పార్టీలో చిన్న స్థాయి నాయకులు క్యాడర్ ని అయితే సస్పెండ్ చేస్తున్నారు కానీ ఎమ్మెల్యేలను మాత్రం ఏమీ చేయరు కదా అన్న ధీమా అయితే పెరిగింది అని అంటున్నారు. ఇక చూస్తే గతానికి ఇప్పటికీ పొలిటికల్ ట్రెండ్ మారింది. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తారో లేదో అన్నది ఎమ్మెల్యేల ఆలోచన. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని తపన పడుతున్నారని అంటున్నారు. తమకు టికెట్ రావాలి మరిన్ని సార్లు గెలవాలి అన్న ఆలోచన అయితే చాలా మంది అయితే ఇపుడు చేయడం లేదు. ప్రస్తుతం చేతిలో అధికారం ఉంది అందుకే చాలా మంది ఎమ్మెల్యేలు అయితే బాగానే పోగేసుకునే పనిలో పడ్డారు అని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. ఈ తరహా ఆరోపణలు వచ్చినపుడు అధినాయకత్వం ఎంత చెబుతున్నా వినడం లేదని అంటున్నారు. ఈ రకమైన అవినీతి ఆరోపణలు కొంతమంది ఎమ్మెల్యేల మీద రావడం బాబు దాకా చేరింది అని అంటున్నారు. అయినా ఎక్కడా కూడా అడ్డగోలు సంపాదన అయితే ఆగడం లేదని అంటున్నారు. ఇక కొందరు ఎమ్మెల్యేల తీరు ఎలా ఉంది అంటే పార్టీ క్యాడర్ ని సైతం పక్కన పెట్టి వారికి ఏమీ చేయకుండా పార్టీ గురించి ఆలోచించకుండా తమ వ్యాపకాలలో మునిగి తేలుతున్నారు అని అంటున్నారు. దొరికిన కాడికి అన్నట్లుగా జోరు చేస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. అయితే ఇవన్నీ కూడా టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ దాకా ఫిర్యాదుల రూపంలోకి వెళ్ళినా ఆయన చెప్పినా కూడా ఎవరూ వినడం లేదా అన్న చర్చ సాగుతోంది. ఇక పోతే పార్టీ క్యాడర్ ఫస్ట్ అని చంద్రబాబు లోకేష్ తరచూ చెబుతూ ఉంటారు, కానీ గ్రౌండ్ లెవెల్ లో చూస్తే క్యాడర్ అల్లల్లాడిపోతోంది, ఎమ్మెల్యేలు కొందరు చిత్తం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏకంగా చంద్రబాబు చెప్పినా కొందరు వినకపోగా దారికి రావడం లేదని అంటున్నారు. ఇపుడు రాజకీయం పూర్తిగా మారిపోయింది. చాన్స్ ఉన్నపుడే చక్కబెట్టుకోవాలన్న నయా రాజకీయ నీతి బాగా పనిచేస్తోంది. అయిదేళ్ళ పాటు అన్నీ మూసుకుని పనిచేసి ఆ మీదట టికెట్ దక్కించుకోవడం కోసం చూడడం కంటే ఎమ్మెల్యేగా తమ పదవి ఉన్నపుడే నాలుగు రాళ్ళు వెనకేసుకుని పోతే చాలు కదా అన్న వినూత్న ఆలోచనలు చాలా మంది చేస్తున్నారు. అతని కంటే ఘనులు అన్నట్లుగా వీరి తీరు ఉంది. ఇది ఆ పార్టీ ఈ పార్టీ అని కాదు అంతటా ఉంది. అయితే క్రమశిక్షణకు మారు పేరు అన్న టీడీపీలో ఈ పరిస్థితులు ఉండడమే విచిత్రంగా చూస్తున్నారు. వీరిని వన్ టైం ఎమ్మెల్యేలు అని ముద్ర వేసినా ఖాతరు చేయడం లేదు, సమాజంలో డబ్బు ఒక్కటే ముఖ్యం అని అంటున్నారు. అందుకే దాని కోసమే పని చేస్తున్నరు అంటున్నారు. అలా కొంతమంది ఎమ్మెల్యేలు డబ్బు సంపాదనలో ఫుల్ బిజీగా మారి పార్టీ జనాలను ఎన్నుకున్న జనాలను పక్కన పడేతున్నారు అని ఫిర్యాదులు అయితే వస్తున్నాయి. మరి ఇలా ఫిర్యాదులు వచ్చిన వారికి హెచ్చరికలు సరిపోవడం లేదు, మరి కఠిన నిర్ణయాలకు టీడీపీ అధినాయకత్వం సిద్ధంగా ఉందా అన్నదే ప్రశ్న. మరి ఒకరిద్దరి విషయంలో గట్టి చర్యలకు దిగితేనే మిగిలిన వారు దారికి వస్తారు అని అంటున్నారు. లేకపోతే పార్టీకి చాలా ఇబ్బంది కలుగుతుందని అంటున్నారు. మరి హైకమాండ్ తరువాత స్టెప్ ఏమిటి అన్నదే ఇపుడు అంతా చూస్తున్నారు.

# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

'అనే నేను...' సంకల్పం. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్, మనం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఐక్యంగా ఈ లక్ష్యాలను సాధిద్దాం" అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు.

**గత పాలన విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా విధ్వంసానికి గురైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల అహంకారం, అవినీతి, అరాచకాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించాం. గత 26 నెలల్లో విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే మా లక్ష్యం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాం" అని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. గత ప్రభుత్వ అప్పులను రీషెడ్యూల్ చేసి రూ.8,269 కోట్లు ఆదా చేశామని, రాష్ట్ర వృద్ధి రేటును 11.3 శాతానికి పెంచామని వివరించారు.

**పెట్టుబడుల వెల్లువ, ఉద్యోగాల కల్పన**

పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపేందుకు 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం. ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరగా, వాటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. తద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దాల్మియా సిమెంట్, హీరో, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను నిరూపించాం. యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుంది. ఇప్పటికే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం" అని సీఎం పేర్కొన్నారు.

**వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్దపీట**

'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. "లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ యూనివర్సిటీకి శ్రీకారం చుడతాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నాం. గత 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టులపై రూ.25 వేల కోట్లు ఖర్చు చేశాం. మరో మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ఫేజ్-1ను త్వరలో ప్రారంభిస్తున్నాం. వంశధార-నాగావళి అనుసంధానం 73 శాతం పూర్తయింది. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం" అని హామీ ఇచ్చారు.

అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని సీఎం వివరించారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామన్నారు. మహిళా సాధికారతకు 'స్వయం బ్రాండ్', పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నకిలీ మద్యంపై ఉక్కుపాదం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించామని, ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను అణిచివేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి పతకాలను ప్రదానం చేశారు.

# ఎర్రకోట నుంచి ప్రధాని వరాల జల్లు..

తీర్చిదిద్దడంలో ఈ నిర్ణయాలు కీలకపాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్**

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఖరీదైన కోచింగ్ క్లాసుల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని ఈ పథకం తగ్గిస్తుందని ఆయన తెలిపారు. "తమ పిల్లలను కోచింగ్‌కు పంపకపోతే అది తమ కుటుంబ ప్రతిష్టకు భంగమని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ ఒత్తిడితో ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పులు చేసి మరీ పిల్లలను కోచింగ్ సెంటర్లకు పంపిస్తున్నారు. ఈ భారాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని మోదీ వివరించారు. దేశంలో ఉన్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, నిపుణులైన ఉపాధ్యాయులను ఉపయోగించుకుని ఈ ఉచిత కోచింగ్ నెట్‌వర్క్‌ను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**క్రీడలు, ఒలింపిక్స్‌పై భారీ లక్ష్యాలు**

క్రీడా రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదుగుతోందని, 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మోదీ స్పష్టం చేశారు. అయితే, ఒలింపిక్స్‌లోని అనేక క్రీడాంశాల్లో కనీసం అర్హత కూడా సాధించలేకపోవడం విచారకరమని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు దేశవ్యాప్తంగా క్రీడా ప్రతిభ అన్వేషణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. "5 నుంచి 15 ఏళ్లలోపు వయసున్న పిల్లల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించి, వారికి ప్రపంచస్థాయి శిక్షణ ఇస్తాం. 2036 నాటికి ఒలింపిక్స్‌లోని అత్యధిక ఈవెంట్లలో మన అథ్లెట్లు పాల్గొనేలా చూడటమే మా లక్ష్యం" అని మోదీ తెలిపారు.

**టెక్నాలజీ, వ్యూహాత్మక రంగాల్లో స్వయంసమృద్ధి**

మారుతున్న ప్రపంచంలో చిప్స్ (సెమీకండక్టర్లు) ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ప్రధాని, ఈ రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. "ఇప్పటికే దేశంలో మూడు కీలకమైన సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రాబోయే 7-8 ఏళ్లలో మరో 5 నుంచి 8 కొత్త ప్లాంట్లు కార్యకలాపాలు ప్రారంభిస్తాయి" అని ఆయన వెల్లడించారు. దీనితో పాటు కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణ అందిస్తామని ప్రకటించారు. ఏఐ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే సత్తా భారత యువతకు అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. అణు విద్యుత్ రంగంలోనూ భారత్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుందని మోదీ తెలిపారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాబోయే 6-7 ఏళ్లలో ఐదు కొత్త అణు రియాక్టర్లను అందుబాటులోకి తీసుకువస్తామని, ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ టెక్నాలజీలో భారత్ సాధించిన పురోగతి అణు ఇంధన స్వయంసమృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు.

**పౌర రక్షణ, ఇతర లక్ష్యాలు..:** ఆధునిక విపత్తులు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పౌర రక్షణ (సివిల్ డిఫెన్స్) వ్యవస్థను బలోపేతం చేస్తామని ప్రధాని తెలిపారు. ఇందుకోసం ఆధునిక శిక్షణతో కూడిన పటిష్టమైన వాలంటీర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వీటన్నింటితో పాటు, 2047 నాటికి ఫార్చ్యూన్ 500 కంపెనీల జాబితాలో 50 భారత కంపెనీలు, ప్రపంచ టాప్-5 బ్యాంకుల్లో ఒక భారత బ్యాంకు ఉండాలనే బృహత్ లక్ష్యాలను కూడా మోదీ నిర్దేశించారు.

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

**తెలంగాణ, సిటిజన్ టైమ్స్**

గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు. 32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# మన కేరాఫ్ అడ్రస్ అమరావతి

గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు. "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. మనం అడ్రస్ లేని వాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి" అని ఆయన పునరుద్ఘాటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం**

విద్యా వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని గర్వంగా ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్లు, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేకుండా చేశామని, పాఠ్యపుస్తకాలపై కానీ, పాఠశాలల వద్ద కానీ ఎక్కడా ముఖ్యమంత్రి లేదా తన ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. చరిత్రలో తొలిసారిగా, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలతో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు వెల్లడించారు.

## మొదటి పేజీ తరువాయి

# వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ తన పాత్ర పోషిస్తుంది

కోసం పోరాడితే, మరో తరం దానిని కాపాడిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' సంకల్పంలో ఏపీ కూడా తనదైన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు పవన్ కల్యాణ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'స్త్రీ శక్తి'కి ఏడాది పూర్తి..

మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రయాణ సమయంలో ఏపీకి చెందినవారని ధ్రువీకరించే గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఎంత దూరమైనా, ఎన్నిసార్లైనా ప్రయాణించేందుకు ఎలాంటి పరిమితి లేదు. ప్రధాన పండుగల సమయంలో దేవాలయాలకు నడిపే ప్రత్యేక బస్సులకు కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేశారు. గణనీయంగా పెరిగిన ప్రయాణికులు ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 87 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయి. పథకానికి ముందు రోజుకు సగటున 9.47 లక్షలుగా ఉన్న మహిళా ప్రయాణికుల సంఖ్య, ఇప్పుడు 24 లక్షలకు చేరింది. దీంతో ఆర్టీసీ మొత్తం ప్రయాణికుల్లో మహిళల వాటా 40 శాతం నుంచి 62 శాతానికి పెరిగింది. ఈ పథకం వర్తించే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు 93 శాతానికి చేరుకోవడం విశేషం. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన 9,978 బస్సుల్లో దాదాపు 7,631 బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది.

భారీగా ప్రభుత్వ వ్యయం, పెరిగిన ఆదరణ

ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్ల సబ్సిడీని భరిస్తున్నట్లు తెలిపింది. మొదటి ఏడాదిలో మొత్తం ఖర్చు రూ.3,095 కోట్లుగా నమోదైంది. 2026-27 బడ్జెట్‌లో కూడా ఈ పథకం కొనసాగింపు కోసం రూ.1,420 కోట్లు కేటాయించారు.

ఈ పథకం వల్ల మహిళలకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపారం వంటి అవసరాలకు సులువుగా ప్రయాణించే అవకాశం కలిగిందని ప్రభుత్వం పేర్కొంది. ఒక్కో లబ్ధిదారు కుటుంబానికి నెలకు సుమారు రూ.1,000 ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. ఈ పథకం వచ్చాక కొన్ని రూట్లలో ప్రైవేట్ వాహనాలు, షేర్ ఆటోల వాడకం తగ్గి ప్రభుత్వ రవాణాకు ఆదరణ పెరిగింది. అయితే, మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఆర్టీసీపై అదనపు భారం పడుతోంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా అదనపు బస్సుల అవసరాన్ని అంచనా వేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గతంలో వెల్లడించారు. తెలంగాణలో 'మహాలక్ష్మి', కర్ణాటకలో 'శక్తి' పేరుతో ఇలాంటి పథకాలే అమలవుతున్నాయి. మహిళల అభివృద్ధి, వారి రవాణా ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# చిన్న తప్పు కూడా పెద్ద నష్టం కలిగిస్తుంది

ఇచ్చారు. "మీరు ఏ పని చేసినా జాగ్రత్తగా, పరిపూర్ణంగా చేయాలి. ఎందుకంటే చిన్న తప్పు కూడా వేరొకరికి తీవ్ర పరిణామాలు కలిగించవచ్చు" అని ఆమె చెప్పారు. మోటార్‌సైకిల్ తయారీలో ఒక చిన్న భాగంలో తప్పు జరిగితే, కొనుగోలు చేసిన వ్యక్తికి ప్రమాదం, నష్టం కలగవచ్చని ఉదాహరణగా చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో కూడా ఒక వెయ్యి రూపాయల బదులు లక్ష రూపాయలు పంపితే నష్టం ఎవరికి వస్తుందని ప్రశ్నించారు. డిజిటల్ సమాచారం నిర్వహణలో తప్పు జరిగితే కస్టమర్‌కు కొత్త సమస్యలు వస్తాయని హెచ్చరించారు. "మీరు నష్టపోరు, వేరొకరు భరించాల్సి వస్తుంది. కాబట్టి ప్రతి క్షణం పరిపూర్ణంగా పని చేయండి" అని ఆమె సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల నుంచి వచ్చిన ఇంటర్న్‌లు పరిశ్రమ అనుభవం, నైపుణ్యాలు సంపాదిస్తున్నారని నిర్మలా సీతారామన్ అభినందించారు. పీఎంఐఎస్ పథకం ద్వారా యువతకు భారత్‌లోని టాప్ 500 కంపెనీల్లో 12 నెలల హ్యాండ్స్-ఆన్ అనుభవం లభిస్తోందని, విద్యా-పరిశ్రమ మధ్య గ్యాప్‌ను తగ్గించడమే దీని లక్ష్యమని తెలిపారు.

# భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు. భారత్ అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆండ్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్-రష్యా అంతరిక్ష సహకారాన్ని వారు గుర్తుచేశారు. 1975లో ఆర్యభట ఉపగ్రహ ప్రయోగంతో మొదలైన సహకారం 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షయాత్రతో మరింత బలపడిందని కికీనా చెప్పారు. ప్రస్తుతం గగన్‌యాన్ కోసం భారత వ్యోమగాములకు రష్యాలో శిక్షణ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. భారత్, రష్యా స్నేహం చిరకాలం కొనసాగాలని ఫెద్యాయెవ్ ఆకాంక్షించారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేపలపాడలో దాతల సేవా కార్యక్రమాలు



**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 15:**
జీవీఎంసీ నాలుగో వార్డ్ పరిధి చేపలపాడలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దాతలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.నడింపల్లి రేవంత్ కుమార్ రాజు, మాజీ సర్పంచ్ కారి అప్పారావు కలిసి 3 లక్షల రూపాయల విలువైన ఫర్నిచర్‌ను ఉచితంగా అందించారు. ఇందులో భాగంగా చేపలపాడలోని 2 పాఠశాలలు, 3 అంగన్వాడి కేంద్రాలకు ఫర్నిచర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ గంటా రవితేజ, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్, జనసేన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పంచకర్ల సందీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు 3 బీరువాలు, 30 కుర్చీలు, 10 ఫ్యాన్లు అందజేశారు. అలాగే 260 మంది విద్యార్థులకు దుస్తులు, నోట్ పుస్తకాలు, మిఠాయి ప్యాకెట్లను పంపిణీ చేశారు. నిడుగట్టు వృద్ధాశ్రమానికి ఒక వాషింగ్ మిషన్‌ను ఉచితంగా అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ జీవన్, పాసి త్రినాధ్ కుమార్.కృష్ణయ్య, సాకరి శ్రీనివాస్.చీపిల్లి శ్రీనివాస్. గరికిన కింగ్.వాసుపల్లి మహేష్, పాఠశాల హెచ్ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం ఎంపీపీఎస్ స్కూల్లో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**ఆనందపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**
ఆనందపురం గ్రామంలో ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు ఆనందపురం గ్రామ పెద్దలు గ్రామ ప్రజలందరూ స్కూల్ జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పైడిరాజు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం ఒక ప్రాముఖ్యతను స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ ఎంతోమంది స్వాతంత్ర సమరయోధులు ప్రాణ త్యాగాల వల్ల మనకు స్వాతంత్ర వచ్చిందని స్వేచ్ఛగా బతుకుతున్నామని విద్యార్థులందరూ కూడా మంచిగా చదువుకొని ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని తెలిపారు జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ ప్రతి సంవత్సరం లాగే విద్యార్థులకు మిఠాయిలు ఆటలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు తరగతి క్లాసుల్లో ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు జై జవాన్ ఫౌండేషన్ షీల్డ్ మరియు సర్టిఫికెట్లు ఇచ్చారు అదే విధంగా ప్రధానోపాధ్యాయులు పైడి రాజు జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు సన్మానం చేశారు ఈ యొక్క కార్యక్రమంలో ఆనందపురం గ్రామం మాజీ సర్పంచ్ చందక లక్ష్మి ఎంపీటీసీ కొట్టాడ రామాదేవి రెడ్డిబాబు మాజీ మండల వైస్ ఎంపీపీ మీసాల సత్యనారాయణ భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, మాజీ వైస్ ప్రెసిడెంట్ బంటుపల్లి రమణమ్మ కొట్యాడ లక్ష్మణ్ మూర్తి, లంక నర్సింగరావు, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమారి, ఉదయ్ రాణి వరలక్ష్మి ,గంగా రామలక్ష్మి జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను సెక్రటరీ ముడసల కార్తీక్ సంతోష్, చిరంజీవి, పాల్గొన్నారు.

## రేఖవాణిపాలెం ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 15:**
భీమిలి మండలం లో 80వ స్వతంత్రదినోత్సవం సందర్భముగా రేఖవానిపాలెం పంచాయతీ ఆఫీస్ వద్ద స్వతంత్రదినోత్సవ వేడుకలు రేఖవానిపాలెం పంచాయతీ ప్రెసిడెంట్ సమ్మిడి శ్రీనివాసరావు మరియు పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమిలి మండల మాజీ ఎంపీపీ యారాబల కృష్ణ వేణి, పంచాయతీ టీడీపీ ప్రెసిడెంట్ ఎర్రబాల ఆనంద్, భీమిలి మండల వైస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు గంధవరపు ఉష, 6 వ వార్డు నెంబర్ మామిడి అప్పల కృష్ణ, 8 వ వర్డ్ మెంబర్ మల్లేటి మహేష్ బీజేపీ నాయకులు రేఖ కరుణ, 5 వ వార్డు మెంబర్ అక్రమని అప్పలస్వామి,2 వ వార్డు నెంబర్ కొండమ్మ భీమిలి మండల వైస్సార్సీపీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ రేగానా రఘు వర్మ రేఖవానిపాలెం ఎంపీపీ స్కూల్ టీచర్స్ , స్కూల్ చైర్మన్ బంకపల్లి సూరిబాబు మరియు విద్యార్థులు అంగన్వాడీ కార్యదర్శి పతివాడ కుమారి మరియు ఆయా గుంటుబోయిన నాగమ్మ గ్రామ ప్రజలు మరియు పంచాయతీ సిబ్బంది వైస్సార్సీపీ సీనియర్ నాయకులు మూర్తి పాల్గొనటం జరిగింది.

# ఆర్టస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,ఆగస్టు 15:**
ఆర్టస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కళాశాల కరస్పాండెంట్ తాకాసి స్వాతి, ప్రిన్సిపల్ గ్రేసీ నంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా వందనం సమర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా వారు స్మరించుకుంటూ, నర్సింగ్ వృత్తి ద్వారా సమాజానికి నిస్వార్థ సేవ చేస్తూ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ వేడుకలను పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల కోసం వివిధ రకాల క్రీడా పోటీలు, ప్రతిభా పోటీలను నిర్వహించారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపక బృందం, శ్రావణి, హెన్నా, పావని, సిమ్రాన్, ఝాన్సీ, మేరీ, అదితి, శివకుమారి, కన్నం నాయుడు, మౌనిక, నీలిమ, రమా, లావణ్య, శ్యామల మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హక్కుల పరిరక్షణ, అవినీతి నిర్మూలనే లక్ష్యం

## నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సాయి రమేష్ గౌడ్




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 15**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని సీతమ్మధార, అంబేద్కర్ నగర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు సాయి రమేష్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకుని గౌరవప్రదమైన జీవనం సాగించినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. సమాజంలో అవినీతి, మోసాలు, హక్కుల ఉల్లంఘనలు జరిగినప్పుడు ప్రజలు ఐక్యంగా చట్టబద్ధ మార్గాల్లో ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. వినియోగదారులు వస్తువులు, సేవలు పొందేటప్పుడు నాణ్యత, బిల్లులను సరిచూసుకోవాలని, అన్యాయం జరిగితే ధైర్యంగా నిలదీయాలని సూచించారు. అలాగే మహిళా సాధికారత, విద్య, ఆర్థిక స్వావలంబన సమాజ ప్రగతికి అత్యంత కీలకమని, కులమతాలకు అతీతంగా మానవ హక్కులను గౌరవించే సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. యువత దేశ నిర్మాణంలో చురుగ్గా పాల్గొంటూ పౌర బాధ్యతలను నిర్వర్తించాలని, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధనకు పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా చైతన్యం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చట్టపరమైన అవగాహన సదస్సులు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆనందపురం పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

- అలరించిన విద్యార్థుల విన్యాసాలు, ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు




**ఆనందపురం (సిటిజన్ టైమ్స్), ఆగస్టు 15:**
స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బంటుబిల్లి లక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు, సాహసోపేత పిరమిడ్ విన్యాసాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు**

గత విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పలువురు దాతలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వేములవలస మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తన తండ్రి స్వర్గీయ కోరాడ నాగభూషణరావు జ్ఞాపకార్థం రూ.11,000 అందించగా, జనసేన నాయకుడు కొయ్యా నాని రూ.10,000, ఉపాధ్యాయుడు భాస్కరరావు రూ.10,000 అందజేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయిని చంద్రమతీ దేవి రూ.5,000, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రేమానంద్, కెజియా రూ.3,000తో పాటు పాఠశాలకు అవసరమైన వైర్‌లెస్ మైక్ సెట్‌ను విరాళంగా ఇచ్చారు. జై జవాన్ ఫౌండేషన్ తరపున కుప్పా రాజశేఖర్ పేరిట భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్పా రామలక్ష్మి రూ.3,000, పాఠశాల ఓఎస్ కొమ్మా జ్యోత్స్న రూ.4,000, చందక అప్పలనాయుడు రూ.2,000, చందక లక్ష్మి రూ.1,500, బమ్మిడి తారక్ రూ.1,000 అందించారు. ఉపాధ్యాయులు శైల, వాణీ పల్లవి, శ్రీనివాస్ సంయుక్తంగా రూ.5,000, రాంప్రసాద్ రూ.2,000, శ్రీవిద్య రూ.1,500, రవిబాబు, కోదండ రూ.1,000 ప్రోత్సాహకంగా అందజేసి విద్యార్థులను అభినందించారు.

**రమ్యకు 'షైనింగ్ స్టార్' అవార్డు**

ఉపాధ్యాయులకు సత్కారం పాఠశాల నుంచి ప్రతిష్టాత్మక 'షైనింగ్ స్టార్' అవార్డు సాధించిన అయితి రమ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ తన విజయానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని, ఈ గుర్తింపుతో మరింత కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకుంటానని తెలిపింది. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకోవాలని పిలుపునిచ్చింది. ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు మొమెంటోలతో, జనసేన నాయకుడు జి.సాయి రూ.3,000 నగదు ప్రోత్సాహకంతో సత్కరించారు. దాత తిమ్మరాజు విద్యార్థులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

**క్రీడాకారులకు అభినందనలు -- దాతల సహకారం**

అమరావతి స్టేట్ లెవెల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన ఆరుగురు పాఠశాల విద్యార్థులను, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను వేదికపై ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశ అభ్యున్నతికి తోడ్పడాలని మాజీ వైస్ ఎంపీపీ మీసాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఎంపీటీసీలు రెడ్డిబాబు, అప్పలస్వామి పాఠశాలకు 20 కుర్చీలను విరాళంగా సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మీసాల రామునాయుడు, కొట్యాడ సత్యమూర్తి, లక్ష్మణమూర్తి, లంకా నర్సింగరావు, అంగటి రాము, చందక సూరిబాబు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వెంకటరంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**
ఆనందపురం మండలం ఆనందపురం గ్రామం శ్రీ వెంకటరంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆఫీస్ ఆవరణలో సంఘం అధ్యక్షులు పాండ్రింకి అప్పలరాజు జాతీయ పతకం ఎగురువేశారు ఈ సందర్భంగా అధ్యక్షులు అప్పలరాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం మన సంఘమునకు బెస్ట్ పెర్ఫార్మర్స్ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని ఇదేవిధంగా రాబోయే కాలంలో సంఘ సభ్యులు అందరూ కష్టపడి రైతులకు మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించి రాష్ట్రంలోనే ఒక మంచి సొసైటీగా తీర్చిదిద్దడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు ఆఫీసు ఆవరణలో సంఘం అధ్యక్షులు మరియు డైరెక్టర్ రామునాయుడు మామిడి మొక్కను నాటారు సంఘ డైరెక్టర్ రామునాయుడు మాట్లాడుతూ సంఘ అభివృద్ధిలో భాగంగా నేను పాల్పంచుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని సంఘ అభివృద్ధికి నా వంతుగా ఏదైనా సాయం చేయవలసి వస్తే తప్పకుండా ముందు ఉంటానని ఆగస్టు 15 రోజు మొక్కలు నాటే కార్యక్రమం చాలా మంచి అభిప్రాయాన్ని ఇదే విధంగా ప్రతి సంవత్సరం ఇలాగ మొక్క నాటితే మన సంఘ ఆవరణ మొత్తం పచ్చదనం ఏర్పడుతుందని ఇదే విధంగా అన్ని సంఘాలు అన్ని పంచాయతీలు సహాయ సహకారాలు అందించాలని మన ఆఫీసు ఆవరణ అంతా పచ్చదనంతో ఉంటుందని చాలా మంచి అభిప్రాయాన్ని ఈ విధంగా అధ్యక్షులు వారిని మెచ్చుకున్నారు. సంఘ డైరెక్టర్ మీసాల రామునాయుడు సంఘ సీఈవో ఎస్ నారాయణరావు మాజీ సీఈవో పంచిముకేశ్ రావు చందక పంచాయతీ పెద్దలు రెడ్డి శంకర్రావు గణేష్ సంఘ యీ+ గ్రూప్ సభ్యులు రెత్తులు మహిళలు పాల్గొన్నారు.

## కేజీబీవీ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**పద్మనాభం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**
పద్మనాభం కేజీబీవీ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ కె. గ్రేసిలిల్లీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవంపై ప్రసంగాలు చేసి, దేశభక్తి గీతాలకు నృత్యాలు ప్రదర్శినా. ఈ సందర్భంలో కెనారా బ్యాంక్, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన ఇద్దరు విద్యార్థులకు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు సంవత్సరానికి 5000 రూపాయల స్కాలర్‌షిప్‌ను అందచేశారు.80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కి విద్యార్థులు పోలీస్ బారెక్స్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ మంత్రి మరియు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసలు, జ్ఞాపిక మరియు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ .ప్రేమ కుమార్ , ఏపీసీ జె.చంద్ర శేఖర్ , జి .సి.డి.ఓ శ్రీదేవి విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ

# నూతన భవన ప్రారంభోత్సవం

### గంటా శ్రీనివాసరావు, పంచకర్ల సందీప్ చేతుల మీదుగా ప్రారంభం





**భీమిలి (సిటిజన్ టైమ్స్ ప్రతినిధి), ఆగష్టు 15:**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పర్వదినాన భీమిలి నియోజకవర్గంలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ పంచకర్ల సందీప్, మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. తొలుత ప్రాంగణంలో మువ్వన్నెల జాతీయ పతాకాన్ని సగర్వంగా ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.

**కూటమి ప్రభుత్వంతోనే శాశ్వత భవన నిర్మాణం..:** భీమిలి మార్కెట్ కమిటీ ఏర్పాటై ఏడాది గడిచినా, సరైన వసతులు లేక ఇన్నాళ్లూ అద్దె భవనంలోనే కార్యకలాపాలు నెట్టుకొచ్చిన పరిస్థితులను స్థానికులు గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు, వ్యాపారులకు మరింత చేరువయ్యేలా నూతన కార్యాలయాన్ని శరవేగంగా నిర్మించి అందుబాటులోకి తీసుకురావడం విశేషం. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు, రైతులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, డాక్టర్ పంచకర్ల సందీప్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**రైతు సంక్షేమానికి మార్కెట్ కమిటీ పెద్దపీట**
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు ఆర్జేడీఎం పి. సుధాకర్, డిఎటిఎంఓ కె.వి.ఆర్.ఎన్. కిషోర్, డిఈఈ కె. శంబనాయక్, మార్కెట్ కమిటీ సెక్రటరీ లక్ష్మీ చైతన్యతో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిన్నింటి జగన్నాథం, డైరెక్టర్లు కుప్ప రామలక్ష్మి, కరీమిరెడ్డి లక్ష్మి, వాళ్ల నందిని, అనుమలశెట్టి సత్య కామేశ్వరరావు, కంది లక్ష్మీనారాయణ, మారిక నూకరాజు, ఉప్పాడ గౌరీ, చెట్ల ఉమాదేవి, గుడ్డల కృష్ణ, పడగల గురునాయుడు, వసంత శ్యామల, కేసము గురుమూర్తి, రౌతు నాగరాజు పాల్గొన్నారు. అలాగే ఆనందపురం మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, ఉపాధ్యక్షులు గొలగాన బాల గోవింద, తాడివాడ శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, సోషల్ మీడియా కన్వీనర్ బాయన ఆనంద్, కూటమి మరియు జనసేన నాయకులు శంకర్, వంశీ, అప్పలరాజు, ఆల్తిరాజు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జాతీయ పతాకం తల్లకిందుల సంఘటనపై గంటా ఆగ్రహం

**విచారణకు ఆదేశం**



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్,ఆగస్టు 15:**
చంద్రంపాలెం హైస్కూల్ లో తల్లకిందులుగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన సంఘటనపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సహా ప్రముఖులు ఎవరినీ ఆహ్వానించకుండా స్వాతంత్య దినోత్సవ వేడుకలను నిర్వహించడమేమిటని హెడ్ మాస్టర్ వెంకట్రావు వైఖరి పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆర్జేడీ విజయ్ భాస్కర్, డీఈఓ ప్రేమ్ కుమార్ లను శనివారం ఆదేశించారు. హెడ్ మాస్టర్ తమను వేధింపులకు గురిచేస్తున్నారని చంద్రంపాలెం హైస్కూల్ టీచర్లు పలుమార్లు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సెలవుపై వెళ్లిన వెంకట్రావు ఇటీవల విధుల్లో చేరిన తర్వాత అదే విధంగా వ్యవహరిస్తున్నారని టీచర్లు ఆవేదన చెందుతున్నారు. ఇదే పంథా కొనసాగితే హైస్కూల్ లో మరిన్ని సమస్యలు తలెత్తుతాయని గంటా పేర్కొన్నారు. ఆయన స్థానంలో ముగ్గురు హెడ్ మాస్టర్ల పేర్లతో ఒక జాబితా తయారు చేయాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి ముగ్గురిలో ఒకరిని హెడ్ మాస్టర్ గా ఎంపిక చేద్దామని చెప్పారు.

## వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**కొత్తపేట, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**
అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేటలోని వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 80వ స్వాతంత్ర్య్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పి.రాజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడానికి వెళ్లడంతో, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. టి.రామాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, ఆర్థిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన, ఐటీ, డిజిటల్ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని

## వాల్మీకిపురం సింగల్ విండో సొసైటీలో రెపరెపలాడిన జాతీయ జెండా

**మదనపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్ట్ ఆగస్టు 15 సీటిజన్ టైమ్స్**
80 వ సంవత్సరం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15 తారీఖున వాల్మీకిపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సొసైటీ చైర్మన్ కే కృష్ణారెడ్డి ( సాకిరేవుపల్లి కృష్ణారెడ్డి ) జాతీయ జెండాను ఎగరవేసి భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన స్వాతంత్ర సమరయోధులను గుర్తుచేస్తూ జాతీయ జెండాకు వందన సమర్పణ చేశారు. ఆంగ్లేలతో పోరాడి మనకు స్వాతంత్రాన్ని అందించిన మహాత్మా గాంధీ,సర్దార్ వల్లభాయ్ పటేల్, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి మహావీరులను గురించి ఎంతో వివరంగా తెలియజేశారు. అనంతరం చైర్మన్ సంఘము యొక్క అభివృద్ధి గురించి మాట్లాడుతూ ఈ సంఘంలో ప్రజలకు,రైతులకు పంట రుణాలపై 7 కోట్ల 20 లక్షల రూపాయలు, బంగారు రుణాలపై 7 కోట్ల 40 లక్షలు, గ్రూపు రుణాలపై 6 లక్షలు, గృహముల పై 15 లక్షలు, స్వయం ఉపాధి పై 4 లక్షలు రుణాలు అందించామని, 2026 సంవత్సరానికి ఇప్పటివరకు సంబంధించి రైతులకు ఒక కోటి రూపాయలు పంట రుణాలుగా అందించామని అన్నారు. ఇంకనూ రాబోవు కాలంలో సొసైటీ నుంచి కేవలం రైతుల కోసమే కాకుండా ప్రజలకు కూడా అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమములో సొసైటీ డైరెక్టర్లు మోహిద్ అలీ ఖాన్ (చాను ), మధు,.సహకార సిబ్బంది సీ ఈ ఓ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మల్లికార్జున, అప్రైజర్ ఆచారి,టిడిపి నాయకులు సాదిక్, మెకానిక్ చాను, గాంధీపేట రమణ, కోసూరి రమేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అసిస్టెంట్‌కు సేవా ఉత్తమ అవార్డు...

ప్రిన్సిపాల్ : డా. వి నరసింహ స్వామి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ డా.రావిరాల మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా ఉత్తమసేవా అవార్డు ను పేరూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ తోట మురళీకృష్ణ అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డా.విన్నా నరసింహ స్వామి తెలిపారు. మురళీకృష్ణ వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గత 22 సంవత్సరాలు అకౌంటెంట్ గా, ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్ గా సేవలు అందిస్తున్న సందర్భంగా రీజినల్ డైరెక్టర్ అఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ రాజమండ్రి వారు, కొత్తపేట ప్రభుత్వ ఐడెంటిటీ కళాశాల వారు మురళీకృష్ణను ఈ ఉత్తమ అవార్డు కు ఎంపిక చేసారిని ప్రిన్సిపాల్ నరసింహ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు డా. కృష్ణ మూర్తి, డా.మోకా బాల స్వామి, డా.పి. కరుణశ్రీ, డా. పి. చంద్ర బోస్, పి. శైలజ, సి.నాగరాణి, పద్మనాభం, త్రిమూర్తులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు మురళీకృష్ణ కు అభినందనలు తెలిపినట్లు ప్రిన్సిపాల్ నరసింహ స్వామి తెలిపారు.

## ఘనంగా 8వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు



**ఏలూరు: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 15:**
ఏలూరు జిల్లా పోలీస్ ఫరడే గ్రౌండ్స్ లో ఘనంగా నిర్వహించిన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్రమంత్రి పులుసు పార్థసారథి పాల్గొని, పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల స్ఫూర్తితో దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి మరింత అంకితభావంతో పని చేద్దామని పిలుపునిచ్చారు.. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని, అభివృద్ధి చెందిన, సంక్షేమ భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి ఆకాంక్షించారు.

## గుర్రంకొండలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 15(సిటిజన్ టైమ్స్)**
అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి మువ్వన్నెల రెపరెపల నడుమ సంబరాలు జరుపుకున్నారు. స్థానిక మండల అధ్యక్షుడు నాయిని జగదీష్ కుమార్,టిడిపి కార్యకర్తలు, ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ శ్రీహరి, ఐ టి డి పి రంజిత్, మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్, ఏజాజ్ అహమ్మద్,జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు పండగలా జరుపుకున్నారు.ఈ వేడుకలు అమరవీరుల త్యాగాలకు స్ఫూర్తి దాయకం అని సందర్భంగా నాయిని జగదీష్ అన్నారు.స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి పోరాట పటిమను, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. అమరవీరుల అడుగుజాడల్లో నడుస్తూ దేశ ప్రగతికి, సమాజ శ్రేయస్సుకు పునరంకితం కావాలని, యువత వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## 80 వ స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు

**రావులపాలెం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**
ఎస్వీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల రావులపాలెం పాఠశాల ప్రధానో పాధ్యాయులు జానకీ దేవి అధ్యక్షతన ఎస్ఎంసి చైర్మన్ నందం వీర వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో ఘనంగా 60 వ. దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. క్రమంలో జడ్పిటిసి సభ్యులు కుడిపూడి శ్రీనివాస రావు మండల స్థాయిలో 2026 మార్చిలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు నగదు బహమలని మెమెంటోలను అంద జేసారు. నందం సత్యన్నారాయణ 10వ తరగతి విద్యార్థులకు నగదు బహుమతిని మెమెంటోను అందజేసారు. కార్యక్రమంలో గొలుగూరి వెంకట్ రెడ్డి,ఆకుల రామకృష్ణ, నల్లమిల్లి వీర రాఘవ రెడ్డి డి సయ్యపు రాజు సందీప్ రాజు, సూరి బాబు, రాము, సీఐ రమేష్ బాబు, మద్దిశీ శెట్టి శెట్టె శ్రీనివాసరావు, చిలువూరి సతీష్ రాములు కోట సోమేశ్ , ద్వారంపూడి వెంకట రెడ్డి, వెలగల



శ్రీనివాసరెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి, అంబటి కిషోర్, కోట వెంకటేశ్వరరావు , పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాశి అన్నపూర్ణ ట్రస్ట్ విక్టరీ.వెంకట రెడ్డి, ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ విదార్థులకు బిస్కెట్లు స్వీట్లు పెన్నులను బహుకరించారు.

## మహిళల ఉచితపస్సు ప్రయాణం ఎంతో మేలు

**రావులపాలెం ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**మహిళలతో ముచ్చటించి పథకం అమలు తీరుపై ఆరా**

**రద్దీ సమయాల్లో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలన్న మహిళలు...**



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రారంభించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాలెంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ఎమ్మెల్యే ముచ్చటించి, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వారు పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలతో కల్సి నేరుగా బస్సులో ప్రయాణిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా పథకం అమలు తీరుపై క్షేత్రస్థాయి పరిస్థితులను ఎమ్మెల్యే పరిశీలించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉపయోగపడుతోంది, ఎక్కడెక్కడికి ప్రయాణిస్తున్నారు, గతంలో ప్రయాణ ఖర్చుల కోసం ఎదుర్కొన్న ఇబ్బందులు ఏమిటనే విషయాలను ఎమ్మెల్యే మహిళలను అడిగి తెలుసుకున్నారు.

# ప్రత్యేక పాఠశాలల్లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి జీవి రామచంద్రరావు











**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 15::**

నగరంలోని ఈస్ట్ పాయింట్ కాలనీలో గల బ్లైండ్ స్కూల్ మరియు ఎంవిపి కాలనీలో గల లేబనిషిఫ్ట్ మానసిక వికలాంగుల పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ పాఠశాలల ప్రాంగణాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పర్యావరణ స్పృహను పెంపొందించేలా బ్లైండ్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వేడుకల్లో భాగంగా మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు తాజా పండ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు మరియు అల్పాహారాలను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, , పెన్నులు మరియు జామెంట్రీ బాక్సులను అందజేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జీవీ రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం సాధించడం ఎంత కష్టమో, వచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం కూడా అంతే బాధ్యతాయుతమైన పని అని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ దేశానికి తాము ఏమి సేవ చేశామన్న కోణంలో ఆలోచించాలని, ఈ ఆలోచనా దృక్పథం విద్యార్థి దశ నుంచే అలవడితే దేశ పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన మహనీయుల ఆశయాలు, వారి చూపిన బాటలో నేటి తరం నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెంకి దుర్గ,సత్తి రాజు, లేబనిషిఫ్ట్ డైరెక్టర్ ఠ చైర్మన్ జి.లక్ష్మి సూర్య శ్రీ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, యోగ మాస్టర్ రెడ్డి, ఫిజికల్ ట్రైనర్ కుమార్, ఉపాధ్యాయ బృందం, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ పాఠశాల గా కొండుకుదురు హై స్కూల్

### సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు తీసుకున్న హెచ్ఎం కుమార్



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కొండుకుదురు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఆగస్టు 15, 2026న అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కొండుకుదురు"కు "ఉత్తమ పాఠశాల పురస్కారం" ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వి. కుమార్ కు ప్రదానం చేసారు. జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబ్ బాషా, జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు , అయినవిల్లి మండల విద్యాశాఖ అధికారులు ఎం. శ్రీనివాస్ ,పివి.శ్రీనివాసరావు , కొండుకుదురు గ్రామ సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ , పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్గా.విశ్వేశ్వర రావు, కమిటీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు జి.రమాదేవి రాంబాబు , గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

## స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి...



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ లో అమలాపురం బాలయోగి ఘాట్ నందు జరిగిన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు.

## విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మండలంలోని కొండుకుదురు గ్రామానికి చెందిన దివంగత బొక్కా సత్య నారాయణ ఆకస్మికంగా మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే.. ఈ సందర్భంగా ఆయన జయంతి ని పురస్కరించుకొని పొట్టిలంక,యలకల్లశీక , గున్నంమెరక గవర్నమెంట్ స్కూల్ సు నందు పిల్లలు కి పెన్నలు నోట్ బుక్స్ ప్లాంక్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దివంగత బొక్కా సత్యనారాయణ మంచితనానికి మానవత్వానికి మారుపేరుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొనే బాల భాస్కర్, వర్రే సూరిబాబు, పొట్టిలంక తాజా మాజీ సర్పంచ్ కొనే చంద్రశేఖర్, సుబ్బలక్ష్మి, గోలకోటి దొరబాబు, కేతా ప్రసాద్ , జంగా డేవిడ్ రాజు,బద్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట అంగనవాడి పాఠశాలలో స్వాతంత్ర వేడుకల్లో పాల్గొన్న భావి పౌరులు.

**మదనపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 15 సీజన్ టైమ్స్.**

భారతదేశానికి స్వాతంత్రము వచ్చి 80 సంవత్సరాల యిన సందర్భంగా మదనపల్లి జిల్లాలోని ప్రతి కార్యాలయము పాఠశాలల్లో కూడా జాతీయ పతాకం రెపరెపలాడింది. ఇలాంటి తరుణంలో చిన్న పిల్లలైనా పుంగనూరు ప్రాజెక్టు కింద ఒంటిమిట్ట అంగనవాడి ఉపాధ్యాయురాలు ఆవల అరుణ పాఠశాలలో పిల్లలను మేము సైతం భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడిన వీరులు లాగా దేశ స్వాతంత్రం కోసం పెద్దవారమై పాటు పడతామని శపథం చేయించి స్వాతంత్ర వేడుకలను జరుపుకున్న చిన్న పిల్లలను చూసి ప్రతి ఒక్కరూ స్వాతంత్రం కోసం సమాజం కోసం పాటుపడాలని, నేర్చుకుంటారని ఒంటిమిట్ట ప్రజలు వారిని కొనియాడుచున్నారు.



# స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో దేశభక్తి పెంపొందించుకోవాలి



**తాడేపల్లిగూడెం:(సిటిజన్ టైమ్స్):ఆగస్టు 15**

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణం, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన జెండా వందనం కార్యక్రమాలలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి వేలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు.. ఝాన్సీ లక్ష్మీబాయి, ఛత్రపతి శివాజీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మార్కులు, ర్యాంకులతో పాటు దేశం గురించి ఆలోచించే విధంగా యువతలో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించాలన్నారు. ముందుగా ప్రతి ఒక్కరూ భారతీయులమనే భావనతో ఉండాలని, కులమతాలకు అతీతంగా దేశ ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ బలమైన దేశంగా ఎదుగుతోందని,2047 స్వాతంత్ర శతాబ్ది ఉత్సవాల నాటికి భారత్ స్వర్ణయుగంలోకి వెళ్లేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాగా పనిచేసే సిబ్బందిని గుర్తించి అవార్డులతో సత్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.పనితీరును బట్టి ప్రోత్సాహకాలు, చర్యలు ఉంటే సిబ్బందిలో మరింత ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే మున్సిపల్ సిబ్బందికి తన తరపున రూ.10 వేల నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. నగదు బహుమతి కంటే వారి కృషికి లభించే గుర్తింపే ముఖ్యమని, మరింత అంకితభావంతో పనిచేసి తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. తాసిల్దార్ సునీల్ కుమార్,మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తదితర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మండలం లోని, పేరూరు సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవంనకు స్థానిక శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిధులుగా విచ్చేసి పతాక ఆవిష్కరణ చేసారని ప్రిన్సిపాల్ డా.విన్నా నరసింహా స్వామి తెలిపారు. ముందుగా మహాత్మా గాంధి, డా అంబేద్కర్,స్వామి వివేకానంద చిత్ర పటాలకు పుష్పలంకరణ చేసారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యం తో అమలాపురం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను స్థాపించడం జరిగిందని ఆనందరావు తెలిపారు.ఈ సంవత్సరం అడ్మిషన్స్ పెరగడం పట్ల ప్రిన్సిపాల్ ను, సిబ్బందిని అభినందిస్తు, కళాశాలకు శాశ్వత భవనం కొరకు ఒక వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తారని, అన్ని సౌకర్యాలతో భవనం డిజైన్ వర్క్ పూర్తయిందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఇప్పుడున్న కంప్యూటర్ ల్యాబ్ ను ఇంకా విస్తరిస్తామని తెలిపారు రు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాస రచన, ఎలుక్యూషన్, డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే ఆనందరావు మెమోంటోలను అందించినట్లు ప్రిన్సిపాల్ నరసింహ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమం నకు పేరూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయ లక్ష్మి, పెచ్చేట్టి విజయ లక్ష్మి, మంతా ఫణి కుమార్, ముత్తాబత్తుల సత్య నారాయణ, దేవరపల్లి వీరేష్, జల్లి శ్రీను, మైల శివ తదితర గ్రామ పెద్దలు, అధ్యాపకులు డా.కృష్ణమూర్తి, డా.బాల స్వామి, డా.కరుణశ్రీ, డా.పి చంద్రబోస్, శ్రీమతి శైలజ, శ్రీమతి నాగరాణి, త్రిమూర్తులు మరియు సీనియర్ అసిస్టెంట్ తోట మురళి కృష్ణ విద్యార్థిని విద్యార్థుల కు ప్రిన్సిపాల్ నరసింహ స్వామి అభినందనలు తెలియ చేసారు.

## ఉత్తమ తహసిల్దార్గా తాడి సుభాష్



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మండల తహసిల్దార్ జిల్లా స్థాయి 'ఉత్తమ ఉద్యోగి' అవార్డులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని బాలయోగి ఘాట్ వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ముమ్మిడివరం మండలం లో తహసిల్దార్ గా విధులు నిర్వర్తించిన టీ.సుభాష్ కు ఉత్తమ సేవలు అందించినందుకు గాను జిల్లా స్థాయి 'ఉత్తమ ఉద్యోగి' అవార్డు లభించింది. ముమ్మిడివరం తహసిల్దార్ కార్యాలయంలో తమ విధుల్లో చూపిన విశేష ప్రతిభ, అంకితభావానికి కార్మిక శాఖ మంత్రి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, అవార్డులను అందుకున్నారు. విధుల పట్ల నిబద్ధతతో పనిచేసినందుకు ఈ పురస్కారాలను అందజేశారు. ఉత్తమ అవార్డు సాధించిన టి.సుభాస్ కు పలువురు ప్రజాప్రతినిధులు, డిప్యూటీ తహసిల్దార్ బి.గోపాలకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు,గ్రామ రెవెన్యూ సహాయకులు,రేషన్ డీలర్స్ సిబ్బంది అభినందించారు.

## 18న నాగర్కర్నూల్లో గౌడ చైతన్య సభ

### 1000 బైకులతో ర్యాలీ - సాయి గార్డెన్లో సభ

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 15**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా ఈ నెల 18న నాగర్కర్నూల్లో గౌడ చైతన్య సభ నిర్వహించనున్నట్లు నాగర్కర్నూల్ తాలూకా గౌడ సంఘం అధ్యక్షుడు వంగ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. తాలూకా గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు గౌడ బిడ్డలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు హౌసింగ్ బోర్డు కాలనీలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ నుంచి సుమారు 1000 బైకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి, పాత కలెక్టరేట్ సమీపంలోని సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్లో సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేశవులు గౌడ్, రమేష్ గౌడ్, అశోక్ గౌడ్, మదన్ గౌడ్, బాలస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్--స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణమే మన సంకల్పం

## ప్రజల భాగస్వామ్యంతో కోనసీమను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దాం

## రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్ వైద్య భీమా సేవల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్





**అమలాపురం సిటిజన్ టైమ్స్,ఆగస్టు 15**

80 వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ సమైక్యత, దేశభక్తి అంకితభావంతో ఏ2047 వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ -విక్షిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర కార్మిక కర్మాగార బాయిలర్ మరియు వైద్య బీమా సేవలు శాఖా మంత్రి వాసంశెట్టి శు భాష్ పేర్కొన్నారు. శనివారం అమలాపురం బాలయోగి స్టేడియం ప్రాంగణం నందు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తో కలిసి 80వ స్వాతంత్ర్య దినోత్సవ జాతీయ పతకావిష్కరణ ఆవిష్కరించి, పోలీస్ కవాత్ నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ వేడుక పురస్కరించుకుని స్వేచ్ఛకు ప్రతికగా కపోతాలను ఎగురవేశారు. పరిశీలన వాహనంలో రాష్ట్ర కార్మిక కర్మాగార వైద్య బీమా సేవల మంత్రి వాసంశెట్టి సుభాష్ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వేడుకలో ప్రజలను ఉద్దేశించి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కవాతు ప్రారంభోత్సవ నేపథ్యంలో పోలీస్ కవాతు,బ్యాండ్ ఎన్ సి సి బృందాలు, జడ్పీ బాయ్స్ హై స్కూల్, జడ్పీ బాలికల హై స్కూల్ బృందాలు త్రివర్ణ పతాక టోపీలను ధరించి ఆకర్షించారు. ప్రభుత్వ శకటాల ప్రదర్శనలో భాగంగా దేవదాయ ధర్మదాయ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రగతి రథం, వ్యవసాయ శాఖ ,ఉద్యాన శాఖ, విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రగతి రథం జిల్లా సర్వే,భూమి రికార్డులు శాఖ, చేనేతమరియు జౌళి శాఖ,వైద్య ఆరోగ్యశాఖ ఆంధ్ర ప్రదేశ్ ప్రజా రవాణా శాఖ జల వనరుల శాఖ పుర పరిపాలన, పట్నాభివృద్ధి శాఖ రాష్ట్ర విపత్తుల సంస్థ శకటాల ప్రదర్శనలు ప్రజలను ఎంతో ఆకర్షించాయి. ఈ ప్రదర్శనలో పుర పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ కు సంబంధించి అన్నా క్యాంటీన్ కు ప్రథమ బహుమతి, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రగతి రథంకు ద్వితీయ బహుమతి, చేనేత జౌళి శాఖకు తృతీయ బహుమతి అవార్డులు పొందారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో అన్ని పాఠశాలల విద్యార్థి విద్యార్థులు దేశభక్తి నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉల్లాసబరితంగా పాల్గొని ప్రజలను ఆకర్షించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలలో అమలాపురం జిల్లా పరిషత్ బాలురు ప్రాథమిక ఉన్నత పాఠశాల 'భారత్ విశ్వగురు' కు ప్రథమ బహుమతి, డి.సత్తిబాబు నేతృత్వంలో కోనసీమ యుద్ధ కళాపరిషత్ 'యుద్ధ విన్యాసాలు' కు ద్వితీయ బహుమతి, వాగ్దేవి బాలికల ఉన్నత పాఠశాల 'దేశభక్తి -సైనికుల త్యాగం'కు తృతీయ బహుమతి అవార్డులు గెలుచుకున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సంస్థలకు వారి సేవలు గాను 431 అవార్డులు ప్రధానం చేశారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మువ్వెన్నల జెండా రంగులను ఫోమ్ ద్వారా ప్రదర్శించారు. ఈ వేడుకలో చిన్నారులు పెద్దలు ప్రజాప్రతినిధులు తిలకించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్ మరియు వైద్య బీమా సేవల శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పత్రికా ప్రతినిధులు, ప్రజలందరికీ హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బాలబాలికలు, విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ఆశీస్సులు అందించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధి,సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తానని, విద్య, వైద్య, ఆరోగ్య, పరిశ్రమలు, మౌలిక వసతుల సదుపాయాల కల్పన కొరకు కూటమిప్రభుత్వం కట్టుబడి పని చేసేలా నా వంతు సహకారం కోనసీమ జిల్లా కు ఉంటుందని తెలియజేశారు. సూపర్-6లో భాగంగా దీపం-2 ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే తల్లికి వందనం కార్యక్రమం, పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు, రైతులకు ఆర్థిక భరోసా కల్పించే అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా డీఎస్సీ చేపట్టామని, మహిళల సాధికారత కోసం స్త్రీ శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దకే చేరేలా వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఆర్థిక అసమానతలను తగ్గించి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు పి 4 విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. 2029 నాటికి శూన్య అని, పేదరికం సాధించేందుకు ప్రభుత్వం,పారిశ్రామిక వేత్తలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం మరింత బలోపేతం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.

**కోనసీమకు ప్రత్యేక గుర్తింపు**

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యవసాయ, మత్స్య, కొబ్బరి రంగాలకు ప్రత్యేక గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. సుమారు 93 కిలోమీటర్ల సముద్ర తీరంతో ఉన్న కోనసీమలో మత్స్యకారుల జీవనోపాధికి కొత్త మార్గాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సముద్రపు నాచు సాగును ప్రోత్సహిస్తూ మామిడికుదురు మండలం కరవాకలో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించామని అన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగును సుమారు 1,000 ఎకరాల్లో విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు "అనే నేను" అనే సంకల్పాన్ని తీసుకోవాలని సూచించారు. రాబోయే 21 సంవత్సరాలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలక కాలమని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. వికసిత్ భారత్--స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో కోనసీమను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి సుసంపన్నమైన స్వర్ణాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని ఆకాంక్షించారు.

## గోళ్ల రమేష్ కు ఉత్తమ సేవా పురస్కారం..



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

వికాస జిల్లా మేనేజర్ గా పనిచేస్తూ ఎందరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న గోళ్ల రమేష్ కు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం

### దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 15**

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించిన ఎమ్మెల్యే... దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి బాధ్యత గురించి ప్రసంగించారు. నాయకులు, కార్యకర్తలు జాతీయ గీతం ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా కూచుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, కౌన్సిలర్లు, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేసిన ..అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జాతీయ పతాక ఆవిష్కరణ చేసి, జెండా వందనం గావించి తదనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు,ఎస్బీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ రాజేష్ ,సోషల్ మీడియా సిఐ తమ్మి నాయుడు, ఆర్ఐ బ్రహ్మానందం,ఆర్‌యస్ఐ ఏసు బాబు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో 80వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు మండల పరిషత్ అధ్యక్షులు కోలా గంగాభవాని బాబ్జీ అధ్యక్షతన జరిగినవి.ఈ వేడుకలను పురస్కరించుకుని మండల పరిషత్ అధ్యక్షులు కోలా గంగాభవాని బాబ్జీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం నకు జడ్పిటిసి సభ్యులు కుడిపూడి శివ శంకర రావు , వైస్ ఎంపీపీ పాము నాగమణి చిట్టి బాబు, ఎంపీటీసీ సభ్యులు,మండల పరిషత్ అభివృద్ధి అధికారి జే ఎల్ ఎన్ దీక్షితులు ,మండల పరిపాలనాధికారి శేష గిరి రావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ డిప్యూటి యం.పి.డి.వో బి.సుజాత, ఏపీఓ ఎం . రామారావు, మండల అధికారులు, మండల పరిషత్ సిబ్బంది , ఎన్ఆర్ఈజీఎస్, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.




## క్రికెట్ పోరుకు రంగం సిద్ధం



**విజయవాడ: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 15:**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరిలో మహిళా డే అండ్ నైట్ మ్యాచులు జరగనున్నట్లు ఏ సి ఏ అధ్యక్షుడు కేసినేని చిన్ని తెలిపారు. వేలం ద్వారా నాలుగు చెట్లు ఖరారు చేశారు. ఈ లీగ్ కు మిత్తాలి రాజ్ మెంటార్గా వ్యవహరిస్తారని, మ్యాచ్లకు ఉచిత ప్రవేశం ఉంటుందని తెలిపారు. జనవరి కి మూలపాడు లో క్రికెట్ అకాడమీ ప్రారంభిస్తామని ఎంపీ వెల్లడించారు.

## ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ప్రసన్న వదన్

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్ట్ 15**

80 స్వతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు ను ముమ్మిడివరం నగర పంచాయతి ఇంచార్జి మేనేజర్ కడలి ప్రసన్న వదన్ అందుకున్నారు. ప్రసన్నకు ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవి వర్మ, అమలాపురం పురపాలక సంఘాల ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



# నమ్మకం నిలబెట్టుకున్నాం..

## అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ చేర్చాం..

### ఉచ్చిలిలో రెండేళ్ల నమ్మకం

### -అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...

**ఆత్రేయపురం సిటిజన్ టైం ఆగస్టు 15**



రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామంలో సోమవారం నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి--సంక్షేమం" కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, స్త్రీ శక్తి తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.ఉచ్చిలి గ్రామంలో 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 410 మంది లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల రూపంలో రూ.4.50 కోట్లు అందించినట్లు తెలిపారు. 577 మంది తల్లులకు తల్లికి వందనం కింద రూ.75.01 లక్షలు, 126 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.26.46 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. ఆటో డ్రైవర్లకు కూడా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.అభివృద్ధి పనుల్లో భాగంగా ఉచ్చిలి జంగాలపేట కమ్యూనిటీ ప్రాంతంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, ఓసీ ప్రాంతంలో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జంగాల కాలనీ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ సమీపంలో సబ్‌మెర్సిబుల్ పంపు ఏర్పాటు, వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ కోసం ఆర్‌సీసీ పైపుల ఏర్పాటు వంటి పనులు కూడా చేపట్టినట్లు వివరించారు.జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, 100 శాతం ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్ల ద్వారా తాగునీటి సరఫరా కోసం మొత్తం రూ.60.60 లక్షల మేర పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉచ్చిలి జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.15.58 లక్షలు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. జంగాలపేటలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, తాడిపూడి బ్రిడ్జి నుంచి కాలువ గట్టు వరకు బీటీ రోడ్డు, అంబేద్కర్ విగ్రహం నుంచి జంగాల పేట వరకు సీసీ రోడ్డు, ఇతర అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ఆరోగ్య క్లినిక్ నిర్మాణానికి రూ.36 లక్షలు కేటాయించి పనులు పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు.వైసీపీ పాలనలో అరాచకం రాజ్యమేలితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రానున్న రోజుల్లోనూ గ్రామాల మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు."ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి గ్రామానికి చేరవేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లా లో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా విచ్చేసి సందేశం ఇచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్

### ఆకట్టుకున్న డాగ్ షో.. -అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

### ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాల ప్రదర్శన.. -జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహుకరణ

### విశిష్ట సేవలకు దక్కిన గుర్తింపు- 242 మందికి ప్రశంస పత్రాలను అందజేసిన కలెక్టర్,ఎస్పీ





**కాకినాడ సిటిజన్ టైమ్స్ ,ఆగస్టు 15**

80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు కాకినాడ జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు ఘనంగా జరగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా ప్రజల ఉద్దేశించి సందేశం ఇచ్చారు... ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు... వేదికకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ గావించిననంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇచ్చారు. అనంతరం పోలీసు జాగిలాలచే ప్రదర్శన, అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సంబంధించిన శకటాల ప్రదర్శన.. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) లతో పాటు...లోక్ సభ,రాజ్యసభ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు,ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం,కర్రి పద్మ శ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య....జగ్గం పేట, టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ,పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ పట్టణ మరియు గ్రామీణ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ, ప్రత్తిపాడు శాసన సభ్యులు సత్య ప్రభ లతో పాటు..... రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామ స్వామి, డిఆర్ఓ డాక్టర్ పి తిప్పే నాయక్ కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివిధశాఖల జిల్లా అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శనలో ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వారికి, సాంస్కృతికకార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ ల చేతుల మీదుగాఅందజేశారు. జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన 242 మంది,అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు. చివరిగా వందేమాతర గేయం, జాతీయ గీతాలాపనతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసాయి .

## దేవాదాయ శాఖ ఏసీ కి విశిష్ట పురస్కారం



**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మురమళ్ల: సుదీర్ఘ కాలంగా దేవాదాయశాఖ లో విశేష సేవలు అందిస్తున్న జిల్లా దేవాదాయ శాఖ అధికారి, శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ వి సత్యనారాయణ కు 80 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతులు మీదుగా విశిష్ట పురస్కారం లభించింది. ఆగస్టు 15 అమలాపురం లో జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారం అందుకొన్నారు. కోనసీమ జిల్లా దేవాదాయ శాఖ అధికారిగా వేదపండితులకు నిరుద్యోగ భృతి,జిల్లాలో వేదవిద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న 60 మంది వేదపండితులకు ఒక్కొక్కరికి నెలకు రూ.3,000 /- భృతి మొత్తం సంవత్సరానికి రూ.1,80,000 /-ధూప దీప నైవేద్యం స్కీమ్ జిల్లాలోని 206 దేవాలయాలకు ఈ స్కీమ్ కింద సహాయం ఒక్కో దేవాలయానికి నెలకు రూ.10,000 /- మొత్తం రూ.20,60,000 /- టి.టి.డి. శ్రీవాణి ట్రస్టు టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా 110 దేవాలయాలకుమొత్తం,రూ.31,10,00,000 /- నిధులు మంజూరు చేయడం జరిగింది. కామన్ గుడ్ ఫండ్ (సి.జి.ఎఫ్) 27 పురాతన దేవాలయాల పునఃనిర్మాణం, మరమ్మత్తులకు మొత్తం రూ.26,98,50,000 /- నిధులు మంజూరు అయ్యేందుకు ఆయా నియోజకవర్గ ప్రజా ప్రతినిధులతో కలిసి విశేష కృషి చేశారు. శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ గా బాధ్యతలు చేపట్టినప్పటినుండి ఆలయం లో స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు తో కలిసి గ్రామస్తుల సహకారం తో పలు అభివృద్ధి కార్యక్రమాల కు శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యార్థం వేద ఆశీర్వచనం వంటి సేవలు ప్రవేశపెట్టారు. సుమారు 14 కోట్ల రూపాయలు వ్యయం తో ఆలయ పునః నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈసందర్భంగా పురస్కారం అందుకున్న అసిస్టెంట్ కమీషనర్ వారికి శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు, చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ధార్మిక సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు అభినందనలు తెలియజేశారు.

## మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

### స్త్రీ శక్తి పథకంతో మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు

### మహిళలతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించి అభిప్రాయాలు తెలుసుకున్న మంత్రి సుభాష్



**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మహిళల సాధికారతకు, వారి ఆర్థిక పురోగతికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న "స్త్రీ శక్తి" పథకం ప్రారంభమై ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం రామచంద్రపురంలో మంత్రి సుభాష్ ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న మహిళలను పలకరించిన మంత్రి, స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై, పథకం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై ఆరా తీశారు. రోజువారీ ప్రయాణాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య, వైద్య అవసరాల కోసం బస్సులను వినియోగిస్తున్న మహిళలు తమ అనుభవాలను మంత్రికి వివరించారు. మహిళలు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం తమ కుటుంబాలకు ఎంతో ఉపశమనాన్ని కల్పించిందన్నారు. ప్రతినెలా ప్రయాణ ఖర్చుల రూపంలో మహిళల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఈ పథకాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి, మంత్రి సుభాష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదని అన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా బలమైన శక్తిగా, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, రుణ సదుపాయాలు వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని, మహిళల స్వేచ్ఛాయుత ప్రయాణానికి ఈ పథకం ఒక మైలురాయిగా నిలిచిందని మంత్రి సుభాష్ తెలిపారు. మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, వారి అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్తులో అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం - ఇంటింటికీ ప్రచారం'

### ఇందుపల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం రూరల్. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మండలం ఇందుపల్లి గ్రామంలో నిర్వహించిన 'ఇంటింటికీ ప్రచారం' కార్యక్రమంలో స్థానిక లిశాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పాల్గొని ప్రతి గడపకూ వెళ్లారు. గత రెండేళ్ల కూటమి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,మంత్రి నారా లోకేష్ ల సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దూసుకుపోతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వంతెనతో తమ రవాణా కష్టాలు తీరాయని గ్రామస్తులు ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా మున్ముందు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే ఆనందరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దానయ్య కుటుంబానికి టీడీపీ రూ.5 లక్షల సాయం

### నిందితులకు జగన్ అండ సిగ్గుచేటుపల్లా శ్రీనివాసరావు



**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్ , ఆగస్టు 15:**

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ఢీకొని మృతి చెందిన గొర్రెల కాపరి దానయ్య కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి టీడీపీ తరఫున రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేసి, కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. ఎప్పుడూ 'నా బీసీలు' అని చెప్పుకునే జగన్‌రెడ్డి, బీసీ బిడ్డ ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబాన్ని పరామర్శించకుండా నిందితులకు రాజకీయ అండగా నిలవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. 18 ఏళ్ల పిల్లవాడు ప్రమాదం చేస్తే తప్పు కాదన్నట్లు జగన్ మాట్లాడటం దారుణమని, చట్టం ముందు ఎవరైనా సమానమేనని స్పష్టం చేశారు. జైలు యాత్రల పేరుతో వైసీపీ కొత్త డ్రామాలకు తెరలేపిందని, పరామర్శకు వెళ్లి మహిళా పోలీస్ అధికారిపై దాడికి యత్నించడం ఆ పార్టీ అరాచక వైఖరిని చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శవం దొరికితే రాజకీయం చేయడం, కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ విధానమని, దానయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు టీడీపీ అండగా పోరాడుతుందని తేల్చిచెప్పారు.

## గోడి గురుకుల హాస్టల్ నందు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

మండలం లోని గోడి గురుకులం (బాలుర) హాస్టల్ నందు 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు... ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరై స్వాతంత్ర దినోత్సవ ప్రత్యేకతలు విద్యార్థులకు వివరించారు. మంగయమ్మ ట్రస్ట్ ఏర్పాటు చేసిన బహుమతులను 2025 -26 సంవత్సరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించినటువంటి విద్యార్థులకు నగదు, షీల్డ్ ను ఎమ్మెల్సీ చేతుల మీదగా విద్యార్థులకు అందజేశారు.




## తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

### మంత్రి సుభాష్ సమక్షంలో 150 మంది వైసీపీ కార్యకర్తల చేరిక



**కాజులూరు సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో కాజులూరు మండలం ఆంద్రంగి గ్రామానికి చెందిన సుమారు 150 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, పారదర్శక పాలన, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, వనుం వీరబ్రహ్మం, డీసీ పేపకాయల బాబ్జి, గ్రామ టీడీపీ అధ్యక్షులు రాజుబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న పి గన్నవరం ఎంపీడీవో

**పి గన్నవరం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 15**


డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం ఎంపీడీవో గుబ్బల మల్లికార్జునరావు ఉత్తమ ఉద్యోగి పురస్కారాన్ని అందుకున్నారు ,జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ,రాష్ట్ర మంత్రిసుభాష్, జిల్లా ఎస్.పి రాహుల్ మీన చేతులు మీదగా జాయింట్ కలెక్టర్ వారి సమక్షంలో బెస్ట్ సర్వీస్ అవార్డు తీసుకున్నాను.



## శ్రీను వైట్ల మళ్లీ మెషిన్ కామెడీ పట్టుకున్నాడా?

శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న ప్రాజెక్ట్ మీద ఫిల్మ్ సర్కిల్స్ లో రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమా పాయింట్ కి సంబంధించి బయటకు వచ్చిన కొన్ని రిపోర్ట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇందులో టైమ్ మిషన్ కు సంబంధించిన ఒక ఎలిమెంట్ ఉండబోతోందనే టాక్ గట్టిగా ప్రచారంలోకి వచ్చింది. అయితే మేకర్స్ నుంచి దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రమోషనల్ అప్డేట్ రాలేదు కాబట్టి, ఇది ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ కథా లేక కథలో ఒక భాగమా అనేది ఇంకా సస్పెన్స్ గానే ఉంది.హీరో శర్వానంద్ ట్రాక్ రికార్డ్ గమనిస్తే ఆయన గతంలోనే 'ఒకే ఒక జీవితం' సినిమాతో టైమ్ ట్రావెల్ జానర్ ను టచ్ చేశారు. ఆ ప్రాజెక్ట్ లో మదర్ సెంటిమెంట్ తో పాటు ఎమోషనల్ జోన్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లోనూ టైమ్ మిషన్ అనే పాయింట్ బయటకు రావడంతో, శర్వా మరోసారి అదే జానర్ లోకి అడుగు పెడుతున్నాడా అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో మొదలైంది.

అయితే గతంలో ఎమోషన్ కు స్కోప్ ఉంటే, ఈసారి దర్శకుడి మార్కు ఎంటర్‌టైన్మెంట్ ఉంటుందేమో అనే ఆలోచన కూడా వస్తోంది. మరోవైపు శ్రీను వైట్ల పాస్ట్ ఫిలిమ్స్ ను ఒకసారి పరిశీలిస్తే ఆయన శైలికి తగ్గట్టుగా విభిన్నమైన కామెడీ ట్రాక్స్ ను డిజైన్ చేయడంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్టీఆర్ నటించిన 'బాద్ షా' సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్ ను అమాయకుడిని చేసి "డ్రీమ్ మెషిన్" అనే ఒక ఫేక్ కాన్సెప్ట్ ను క్రియేట్ చేసి థియేటర్లలో పెద్ద ఎత్తున నవ్వులు పూయించారు. ఆ సీన్స్ అప్పట్లో సినిమాకి మెయిన్ హైలైట్స్ లో ఒకటిగా నిలిచాయి.ఇప్పుడు శర్వా తో కూడా నిజంగానే ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తో కూడిన టైమ్ మిషన్ కథ ఉంటుందా, లేదంటే బాద్ షా తరహాలోనే ఏదైనా ఫిక్షనల్ సెటప్ లేదా కామెడీ డివైజ్ క్రియేట్ చేసి దాని చుట్టూ ఫన్ నడిపిస్తారా అనే సందేహాలు వస్తున్నాయి. శ్రీను వైట్ల మార్కు ప్రసెంట్ చేసే పద్ధతి తెలిసిన వాళ్లు మాత్రం, ఈ పాయింట్ ను సీరియస్ కథగా కాకుండా తన స్టైల్ లోనే ఎంటర్‌టైన్మెంట్ కు వాడుకునే ఛాన్స్ ఉందేమో అనుకుంటారు.ఒకవేళ నిజంగానే కామెడీ డివైజ్ చుట్టూ కాకుండా ప్రాపర్ టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నడిచినా, శ్రీను వైట్ల శైలిలో సిట్యువేషనల్ హ్యూమర్ కు మంచి స్కోప్ దొరికే అవకాశం ఉంటుంది. శర్వానంద్ టైమింగ్ కి, శ్రీను వైట్ల కామెడీ ఐడియాలకు తోడు ఈ కొత్త బ్యాక్ డ్రాప్ కూడా తోడైతే అవుట్ పుట్ డిఫరెంట్ గా వచ్చే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్ట్ లో నిజంగానే ఏదైనా టైమ్ ట్రావెల్ ఎలిమెంట్ ఉందా లేక శ్రీను వైట్ల తన పాత ఫార్ములాలోనే ఏదైనా ఫేక్ కన్ఫ్యూజన్ డ్రామా సెట్ చేశారా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



## జాన్వీ - రష్మిక కాంబోలో ట్విస్ట్.. 'రాకా'లో సీక్రెట్ ఏంటి?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతోన్న పవర్ ఫుల్ పాన్ వరల్డ్ సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ 'రాకా'. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రతీ చిన్న వార్త నెట్టింట క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నల పాత్రలకు సంబంధించిన ఆసక్తికర వివరాలు లీకై సోషల్ మీడియాలో విపరీతమైన క్యూరియాసిటీని పెంచేస్తున్నాయి. ఆ లేటెస్ట్ విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**గిరిజన రాణిగా జాన్వీ కపూర్:**

ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో జాన్వీ కపూర్ ఒక పవర్‌ఫుల్ గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించబోతుందట. ఇది కేవలం అతిథి పాత్ర కాకుండా, కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన రోల్ అని టాక్. ఇక ఇప్పటివరకు గ్లామరస్ పాత్రల్లోనే మెరిసిన జాన్వీ, ఈ సినిమాలో చాలా విభిన్న పాత్రతో అలరించనుందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**రక్షకురాలిగా రష్మిక మందన్న:**

మరోవైపు రష్మిక మందన్న కూడా ఈ సినిమాలో ఓ ప్రత్యేకమైన రోల్ చేయబోతోందని సమాచారం. కథానాయకుడికి ఒక గైడ్‌గా, రక్షకురాలిగా వ్యవహరించే పాత్రలో రష్మిక కనిపించనుందట. సెంట్రల్ స్టోరీలైన్‌తో ఈమె పాత్రకు బలమైన కనెక్షన్ ఉండబోతోందని లీక్డ్ వార్తలు చెబుతున్నాయి. ఇక ఇప్పటివరకు చూడని డిఫరెంట్ లుక్స్‌లో ఈ ఇద్దరు భామలు అదరగొట్టబోతున్నారని టాక్.

**మ్యూజిక్ అండ్ షూటింగ్ అప్‌డేట్:**

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ అల్లు అర్జున్, దీపికా పదుకొణె కాంబినేషన్ సీన్లను చిత్రీకరిస్తున్నారు. ఇక ఈ భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంగ్ సంగీతం అందిస్తున్నారు. బిగ్గెస్ట్ కాస్టింగ్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా మారింది.

**సైన్స్ ఫిక్షన్ విత్ మైథాలజీ ట్విస్ట్:**

'రాకా' అంటే నిండు పౌర్ణమి అనే అర్థం ఉంది. చీకటి నుంచి వెలుగును నింపే యోధుడిగా అల్లు అర్జున్ కనిపించబోతున్నారని, సైన్స్ ఫిక్షన్ కథకి అట్లీ మైథలాజికల్ టచ్ ఇస్తున్నారని నెట్టింట రకరకాల థియరీలు వైరల్ అవుతున్నాయి.

ఇక రోజుకో కొత్త వార్త బయటకు వస్తుండటంతో ఈ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందోనని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

జాన్వీ కపూర్, రష్మిక మందన్నల రోల్స్‌పై వస్తున్న కథనాలపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే అట్లీ విజన్, బన్నీ ఊరమాస్ క్రేజ్ తోడు కావడంతో 'రాకా' సినిమా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



## 600వ టెస్టు: సెంచరీతో మెరిసిన పడిక్కల్.. తొలి రోజు భారత్ జోరు

- లంకతో టెస్టులో పటిష్ఠ స్థితిలో భారత్
- ఓపెనర్ జైస్వాల్ త్వరగా ఔట్
- ఆదుకున్న రాహుల్, పడిక్కల్
- భారీ భాగస్వామ్యం నమోదు చేసిన ద్వయం
- భారీ స్కోరు దిశగా సాగుతున్న టీమిండియా




శ్రీలంక పర్యటనలో భాగంగా గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు తొలి రోజే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (107 బ్యాటింగ్) అద్భుత శతకంతో కదం తొక్కగా, సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్ (77) అర్ధశతకంతో రాణించాడు. వీరిద్దరి నిలకడైన ఆటతో, మూడో సెషన్ కొనసాగుతుండగా భారత్ 2 వికెట్ల నష్టానికి 239 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు ఆరంభంలోనే చిన్న షాక్ తగిలింది. దూకుడుగా ఆడిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ (32) దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ జోడీ లంక బౌలర్లను ఓపికగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 150 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. అయితే, 77 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కేఎల్ రాహుల్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడటం భారత్‌ను కాస్త నిరాశపరిచింది. రాహుల్ వెనుదిరిగినా పడిక్కల్ ఏమాత్రం ఒత్తిడికి గురికాలేదు. తన సహజ శైలిలో ఆడుతూ లంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. మధ్యలో వర్షం కారణంగా ఆటకు కొద్దిసేపు అంతరాయం కలిగినా, అతని ఏకాగ్రతను దెబ్బతీయలేకపోయింది. అద్భుతమైన షాట్లతో అలరించిన పడిక్కల్, 147 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

ఇక, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ప్రస్తుతం పడిక్కల్‌కు తోడుగా రిషభ్ పంత్ (3) క్రీజులో ఉన్నాడు. లంక బౌలర్లలో జయసూర్యకు ఒక వికెట్ దక్కింది. తొలి రోజు ఆటలో భారత్ పూర్తి ఆధిక్యం కనబరచడంతో, భారీ స్కోరు చేసే దిశగా పయనిస్తోంది.

## ఒక్క పోస్ట్.. భారత క్రికెట్‌లో ముగిసిన ఒక స్వర్ణయుగం.. ధోనీ వీడ్కోలుకు ఆరేళ్లు!

- ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఆరేళ్లు పూర్తి
- 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29కి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన
- మూడు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఏకైక కెప్టెన్‌గా చారిత్రక రికార్డు
- ఐపీఎల్‌లో చెన్నైకి 5 టైటిళ్లు అందించిన ఎంఎస్‌డీ
- ప్రపంచ క్రికెట్‌లో ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన ధోనీ వారసత్వం






భారత క్రికెట్ చరిత్రలో అదొక మరపురాని రోజు. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో మునిగి తేలుతున్న వేళ, ఒక శకం ముగిసింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలకు.. భారత క్రికెట్‌ను శాసించిన, అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకడైన మహేంద్ర సింగ్ ధోనీ తన 15 ఏళ్ల అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఎలాంటి మీడియా సమావేశం లేదు, సుదీర్ఘ ప్రసంగాలు లేవు, ఆర్భాటాలు అసలే లేవు. తనకు మాత్రమే సాధ్యమైన రీతిలో అత్యంత నిశ్శబ్దంగా ధోనీ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు.

తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో, తన క్రికెట్ ప్రయాణంలోని మధురమైన చిత్రాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నాడు. ఆ వీడియో నేపథ్యంలోని 'మై పల్ దో పల్ కా షాయర్ హూన్' అనే ముకేశ్ పాట, అతని వీడ్కోలు భావనకు అద్దం పట్టింది. "ఇన్నాళ్లు మీరు చూపిన ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. ఈ రోజు రాత్రి 7:29 గంటల నుంచి నన్ను రిటైర్ అయిన వ్యక్తిగా పరిగణించండి" అని క్లుప్తంగా రాసుకొచ్చాడు. అంతే.. ఒక్క పోస్ట్‌తో భారత క్రికెట్‌లో ఒక స్వర్ణయుగం ముగిసిపోయింది. నాయకత్వానికి కొత్త అర్థం చెప్పిన, ఒత్తిడిలో మ్యాచ్‌లను ముగించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్న ఒక గొప్ప యోధుడు మైదానం నుంచి అలా నిష్క్రమించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ధోనీ, ఆ తర్వాత చరిత్ర సృష్టించాడు. మూడు ప్రధాన ఐసీసీ ట్రోఫీలు (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ) గెలిచిన ప్రపంచంలోని ఏకైక కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. 2007లో తొలి టీ20 ప్రపంచకప్‌ను యువ జట్టుతో గెలిచి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత 2011లో వాంఖడే స్టేడియంలో సిక్సర్‌తో వన్డే ప్రపంచకప్‌ను అందించి భారతీయుల 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపుతో అతని కెప్టెన్సీ ప్రస్థానం పరిపూర్ణమైంది. ఆటగాడిగానూ ధోనీ గణాంకాలు అద్భుతం. 350 వన్డేల్లో 10,773 పరుగులు, 90 టెస్టుల్లో 4,876 పరుగులు చేశాడు. 98 టీ20 మ్యాచ్‌లలోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వికెట్ల వెనుక అతడి చురుకుదనానికి 829 అంతర్జాతీయ డిస్మిసల్స్ నిదర్శనం. ప్రపంచంలోని గొప్ప వికెట్ కీపర్-బ్యాటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఆడిన మ్యాచే మహీ చివరి అంతర్జాతీయ మ్యాచ్.

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, క్రికెట్‌కు మాత్రం దూరం కాలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు నాయకుడిగా కొనసాగుతూ, ఆ జట్టుకు ఐదుసార్లు టైటిల్స్ అందించాడు. 2023లో కూడా సీఎస్‌కేను ఛాంపియన్‌గా నిలబెట్టడం ధోనీ నాయకత్వ పటిమకు నిదర్శనం.ధోనీ వారసత్వం కేవలం ట్రోఫీలు, పరుగులకు మాత్రమే పరిమితం కాదు. ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉంటూ నిర్ణయాలు తీసుకోవడం అతని ప్రత్యేకత. అందుకే అభిమానులు ముద్దుగా 'కెప్టెన్ కూల్' అని పిలుచుకుంటారు. ఆరేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలు అయిందంటే కోట్లాది మంది అభిమానుల గుండెల్లో మహీ జ్ఞాపకాలు మెదులుతూనే ఉంటాయి.

## శ్రీలంక సిరీస్ తర్వాత అగార్కర్ భవిష్యత్తుపై బీసీసీఐ కీలక నిర్ణయం!



భారత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. శ్రీలంకతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత బీసీసీఐ పెద్దలు అగార్కర్‌తో సమావేశం కానున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. సెప్టెంబరుతో సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అగార్కర్ మూడేళ్ల పదవీకాలం పూర్తవుతుంది. దీంతో మరో ఏడాది పొడిగింపు ఇవ్వాలా? వద్దా? అన్నదానిపై ఈ భేటీలో చర్చ జరిగే అవకాశం ఉంది.అగార్కర్ భవిష్యత్తుపై చర్చకు మరో అంశం కూడా కారణమవుతున్నట్లు సమాచారం. రోహిత్ శర్మ భవిష్యత్తుపై సెలెక్టర్లు, బీసీసీఐ మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్‌తో జులైలో జరిగిన వన్డే సిరీస్ తర్వాత రోహిత్‌ను జట్టు నుంచి తప్పించే ఆలోచన ఉందని సెలెక్టర్లు అతడికి తెలిపినట్లు నివేదిక పేర్కొంది. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాత్రం రోహిత్ జట్టు ప్రణాళికల్లో ఉన్నంతకాలం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటాడని వ్యాఖ్యానించారు.2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని రోహిత్ భవిష్యత్తును ప్రతి సిరీస్ తర్వాత సమీక్షించాలని బీసీసీఐ కోరుకుంటున్నట్లు సమాచారం. అయితే సైకియా చేసిన వ్యాఖ్యలు సెలెక్టర్లకు అసంతృప్తి కలిగించినట్లు నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో అగార్కర్‌తో జరగనున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. సెలక్షన్ కమిటీ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలతో పాటు రోహిత్ అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

ఇంగ్లాండ్‌తో చివరి వన్డేలో రోహిత్ శర్మ అద్భుత శతకంతో తనపై వస్తున్న విమర్శలకు బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో 138 పరుగులతో చెలరేగాడు. లార్డ్స్‌లో వన్డే శతకం సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. శుభ్‌మన్ గిల్‌తో 147 పరుగుల భాగస్వామ్యం, విరాట్ కోహ్లీతో 113 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776